సత్యానగర్ యూజీడీకి రూ. 37 లక్షల నిధులు

రామంతాపూర్ : భగవత్ సత్యానగర్‌లో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి రూ.37 లక్షలు మంజూరు చేసినట్లు సోమవారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ రఫీక్, వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లపు శ్రీకాంత్‌యాదవ్, రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, అశోక్, ప్రసాద్, భాస్కర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లా కనెక్షన్ రెగ్యులరైజ్ చేయాలి



జలమండలి అధికారులకు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: ప్రజల అవసరాలకు నల్లా కనెక్షన్ రెగ్యులైజ్ చేయాలని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ సూచించారు. సోమవారం జవహర్‌నగర్ కాలనీలో ఆయన పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో ప్రజలకు ఉపయోగపడే నల్లా కనెక్షన్లను ఉచితంగా అందజేయాలని, లేదంటే ఉన్న వాటిని రెగ్యులరైజేషన్ చేస్తే వారే బిల్లు చెల్లిస్తారన్నారు. డీజీఎం అశ్రిత, మేనేజర్ తేజశ్విని, సభ్యులు నారాయణ, ముత్యం రెడ్డి, మల్లేష్‌గౌడ్, జాన్, కిషోర్ పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన



దుర్గానగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని దుర్గానగర్‌లో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. సోమవారం ఇంటింటికీ తిరిగి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు రోడ్లు, తదితర సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దుర్గానగర్‌లో మిగిలిపోయిన రోడ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏఈకి సూచించారు. కాలనీలో నెలకొన్న సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. మల్లాపూర్ ఏఈ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు బిక్షపతి, రామారావు, దుర్గానగర్ కాలనీవాసులు మహేందర్, రాజు తదితరులున్నారు.

బాధ్యతల స్వీకరణ



నూతన డీసీ జకియా సుల్తానాకు అభినందనలు తెలుపుతున్న డీసీ రాజు

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్‌గా జకియా సుల్తానా సోమవారం మధ్యాహ్నం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న గోధుమల రాజు ఉప్పల్‌కు బదిలీ అయ్యారు. సుదీర్ఘ కాలం పనిచేసిన ఆయన మల్కాజిగిరి సర్కిల్ అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించి ప్రజల నుంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

బోనాల ఏర్పాట్లకు చొరవ తీసుకోవాలి



డీసీకి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

మల్కాజిగిరి: 20,21న జరిగే బోనాల జాతర ఏర్పాట్లపై ప్రత్యే చొరవ తీసుకోవాలని బీజేపీ నాయకులు సర్కిల్ డీసీ రాజుకు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి జాతర అనంతరం మల్కాజిగిరిలో ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి జాతర ఘనంగా జరుగుతుందన్నారు. మరో 5 రోజులు ఉందని, మొబైల్ టాయిలెట్స్, తాగునీటి సరఫరా, విద్యుత్ దీపాలు, దోమలబెడద లేకుండా ఫాగింగ్, శానిటేషన్ పనులు చేపట్టాలని కోరామన్నారు. బక్క నాగరాజు, శ్రీనివాస్, ధర్మతేజ, విజయ్‌కుమార్, దాసన్, వెంకట్ ఉన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

బోడుప్పల్: మేడిపల్లి సర్వేనంబర్ 48లో పేద ప్రజలు నివసించే భగత్‌సింగ్ కాలనీలో మౌలికవసతులు కల్పించాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. బోడుప్పల్ రా చెరువు కింద నాలాను కబ్జాచేసి ఇందిరమ్మ పథకం మంజూరైన ఇంటిని నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. సదరు నిర్మాణాన్ని నిలిపేసి నాలా స్థలాన్ని పరిరక్షించాలని కోరారు. మేడిపల్లి సీపీఐ కార్యదర్శి రచ్చకిషన్, కౌన్సిల్ సభ్యుడు దండు రమేష్, ప్రమీల, మహాలక్ష్మి, బాపిరాజు, నాగరాజు, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇలాగైతే తాగేదెట్లా?

- కలుషిత తాగునీటి సరఫరాతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- నల్లాల్లో దుర్వాసన, పాత పైపులు తొలగించాలని డిమాండ్



రామంతాపూర్ : హబ్సిగూడ, రామంతాపూర్ డివిజన్లలోని అన్ని ప్రాంతాల్లో రోజు విడిచి రోజు నల్లాల ద్వారా తాగునీటి సరఫరా జరుగుతుంది. అయితే ఈ డివిజన్లలోని కొన్ని కాలనీలు, బస్తీల్లో అరగంట పాటు నల్లాల ద్వారా సరఫరా అయ్యే తాగునీరు దుర్వాసనతో రంగుమారి వస్తున్నాయి. ముఖ్యంగా హబ్సిగూడ డివిజన్‌లోని రాంరెడ్డినగర్, రామంతాపూర్ డివిజన్లలోని శ్రీరామకాలనీలోని వీధినెంబర్ 2, 6, 8లలో ఇందిరానగర్‌లోని సత్యదేవుని ఆలయం, నెహ్రూనగర్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఓల్డ్ రామంతాపూర్‌లోని కార్డినల్ స్కూల్ ఎదురుగా ఉన్న ఇళ్లలో కలుషిత నీరు సరఫరా అవుతోంది. ప్రస్తుతం ఎటు చూసినా విషజ్వరాలు..

- కలుషిత తాగునీటి సరఫరాతో అంటు వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో పలు బస్తీలు, కాలనీవాసులు భయాందోళనకు గురౌతున్నారు. కొన్నిచోట్ల నల్లాల్లో తాగునీటి సరఫరా చేసేటప్పుడు మొదట 15 నిమిషాలు కలుషిత జలాలు వస్తున్నాయని వాపోయారు. దీనిపై జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా తాత్కాలిక చర్యలు చేపట్టి వదిలేస్తున్నారంటున్నారు. కొత్త పైపులైన్లు వేసి కలుషిత నీటి సరఫరా సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం



రామంతాపూర్‌లోని కొన్ని ప్రాంతాల్లో కలుషిత నీటి సరఫరా అవుతున్న విషయం వాస్తవమే. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు పాత పైపులైన్లను తొలగించి కొత్త పైపులైన్ పనులను ఇటీవల ఇందిరానగర్‌లో ప్రారంభించాం. మిగతా ప్రాంతాల్లో కూడా త్వరలోనే ప్రారంభించి తాగునీటిలో కలుషిత నీరు సరఫరా కాకుండా తగిన చర్యలు తీసుకుని, సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం.

– బండారు శ్రీవాణి, రామంతాపూర్ కార్పొరేటర్

కలుషిత నీటి సరఫరాతో జ్వరాలు

కొన్ని బస్తీలు, కాలనీలో నల్లాలో సరఫరా అవుతున్న కలుషిత తాగునీరు తాగిన ప్రజలు జ్వరాలు, అంటువ్యాధులతో ఇబ్బందులకు గురై అనారోగ్యం పాలవుతున్నారు. ప్రజాప్రతినిధులు జలమండలి అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి పేద, మధ్యతరగతి ప్రజలు నివసించే బస్తీలు, కాలనీల్లో కూడా కలుషిత నీటి సరఫరా జరగకుండా కొత్త పైపులైన్లు వేసి సమస్యను పరిష్కరించాలి.

– ఎర్రం శ్రీనివాస్, శ్రీరామకాలనీ

కలుషిత నీటి సరఫరాకు కారణాలు..

మున్సిపాలిటీగా ఉన్నప్పుడు అప్పటి జనాభాకు తగినట్లుగా వేసిన తాగునీటి పైపులైన్లు జీహెచ్‌ఎంసీ పరిధిలోకి చేరిన తర్వాత కూడా అవే పైపులైన్లు కొనసాగడంతో రంధ్రాలు ఏర్పడినట్లు ఆరోపణలున్నాయి. ఓపెన్ మురుగు నాలాలు భూగర్భ డ్రైనేజీ పైపులైన్ల పక్కనే తాగునీటి సరఫరా చేసే పైపులైన్లు ఉండటం వల్ల అదే విధంగా కొంతమంది వరద నీటి కాలువల్లో భూగర్భ డ్రైనేజీ కనెక్షన్లు ఇచ్చుకోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని కొందరు అభిప్రాయపడుతున్నారు.

సమీకృత వ్యర్థాల పార్కు సందర్శన



పీర్జాదిగూడలోని సమీకృత పార్కు వద్ద విద్యార్థులు, మున్సిపల్ అధికారులు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి పర్వతాపూర్‌లోని సమీకృత వ్యర్థాల పార్కు (డంపింగ్‌యార్డు)ను భాష్యం బ్లూమ్స్ స్కూల్ విద్యార్థులు సందర్శించారు. వందరోజుల కార్యాచరణ, స్వచ్ఛ్ పీర్జాదిగూడలో భాగంగా సోమవారం విద్యార్థులు సమీకృత వ్యర్థాల పార్కులో చెత్తను వేరు చేసే విధానాలను పరిశీలించారు. తడిచెత్తతో బ్రికెట్స్ తయారీ, కంపోస్టు, పొడిచెత్తతో రీసైక్లింగ్ చేస్తున్న వివిధ ప్రక్రియలను పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు మాట్లాడుతూ.. స్వచ్ఛ్ పీర్జాదిగూడకు మేముసైతం అని విద్యార్థులు ముందుకొచ్చి పలు కార్యక్రమాల్లో పాలుపంచుకుని ప్రజల్లోకి స్వచ్ఛత నినాదాన్ని తీసుకెళ్లడంపై హర్షం వ్యక్తం చేశారు. తడి, పొడిచెత్త వేరు చేసే విధానం పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శోభాశంకర్, డిప్యూటీ ఇంజినీర్ సాయినాథ్‌గౌడ్, మేనేజర్లు క్రాంతికుమార్,కిషోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, బాలమురళీకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారిని ఆరాధిస్తే సకల శుభాలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

రామంతాపూర్ : నియోజకవర్గంలోని వివిధ బస్తీలు, కాలనీల్లోని అమ్మవారి ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం రామంతాపూర్ భరత్‌నగర్‌లోని రేణుకాఎల్లమ్మ దేవాలయంలో నిర్వహించిన అమ్మవారి 18వ వార్షికోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సకలశక్తి స్వరూపిణి అమ్మవారిని ఆరాధిస్తే సకల శుభాలు కలుగుతాయన్నారు. కార్పొరేటర్ బండారు శ్రీవాణివెంకట్‌రావు, మాజీ కార్పొరేటర్ గంధం జ్యోష్న, ఆలయ చైర్మన్ రాంరెడ్డి, కోశాధికారి జానయ్య, ప్రధాన అర్చకులు శ్యామ్‌మోహన్‌చారి తదితరులు పాల్గొన్నారు.

ప్యాచ్‌వర్క్స్‌పై స్పెషల్ డ్రైవ్



ఉప్పల్: డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో సీసీరోడ్లు నిర్మిస్తున్నట్లు ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అధికారులతో కలిసి ప్యాచ్‌వర్క్స్ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలం సందర్భంగా స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడ గుంతలు ఏర్పడినా.. వెంటనే మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. ఈఈ హరిలాల్, ఏఈ రాజ్‌కుమార్, కొండ్రు హనుమంతు, సత్యపాల్‌రెడ్డి, గణేష్ తదితరులున్నారు.

ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా రాజు

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా గోధుమల రాజు సోమవారం సాయంత్రం పదవీ బాధ్యతలు చేపట్టారు. డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన ఆంజనేయులు సికింద్రాబాద్ సర్కిల్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు పేర్కొన్నారు.



జైలు పరిశ్రమలు మరింత బలోపేతం

డాక్టర్ సౌమ్యమిశ్రా జైళ్లశాఖ డీజీ



ఖైదీల శిక్షణ కార్యక్రమంలో జైళ్లశాఖ డీజీ డాక్టర్ సౌమ్యమిశ్రా

కుషాయిగూడ: రాష్ట్రవ్యాప్తంగా జైళ్లలో నిర్వహిస్తున్న జైలు పరిశ్రమలు మరింత బలోపేతం కావాల్సిన అవశ్యకత ఉందని జైళ్లశాఖ డీజీ డాక్టర్ సౌమ్యమిశ్రా అన్నారు. జైలు ఉత్పత్తుల నాణ్యత ప్రమాణాలను పెంచడంలో భాగంగా ఖైదీలకు ఏర్పాటు చేసిన రెండ్రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆమె చర్లపల్లి కేంద్ర కారాగారంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం జైలు ఉత్పత్తులైన ఫినాయిల్, ఫ్లోర్ క్లీనర్, లిక్విడ్ సోప్, హ్యాండ్‌వాష్, డిష్‌వాష్, టాయిలెట్ క్లీనర్ వంటి ఉత్పత్తుల తయారీకి ప్రామాణికమైన వ్యవస్థ లేదన్నారు. ఎస్‌ఓపీ అమలు చేసి బ్రాండెడ్ జైలు ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకురావాలన్నది జైళ్లశాఖ ఉద్దేశమన్నారు. దీంతో ఖైదీల నైపుణ్యం పెరగడం, సరిపడా పని లభించడం, ఆదాయం పెరుగుతుందన్నారు. ఖైదీల సంక్షేమం అమలుకావడంతో పాటు జైలు ఉత్పత్తులకు మార్కెట్‌లో ఆదరణ పెరుగుతుందన్నారు. ఉత్పత్తుల తయారీలో నాణ్యత ప్రమాణాలు, ప్యాకింగ్, బ్రాండింగ్ వంటి అంశాలపై ఖైదీలకు రెండ్రోజుల పాటు శిక్షణను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఖైదీలు దీనిని సద్వినియోగం చేసుకుని ఆదాయమార్గాలు పెంచుకోవాలన్నారు. జైళ్లశాఖ ఐజీలు మురళీబాబు, డాక్టర్ శ్రీనివాస్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ ఎస్.ఎం. ఖలీద్ అక్తర్, చర్లపల్లి, సంగారెడ్డి, నిజామాబాద్ జైళ్ల పర్యవేక్షణాధికారులు నవాబ్ శివకుమార్‌గౌడ్, కళాసాగర్, సీహెచ్. దశరథం తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్

అల్వాల్: రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నందున కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ ఆధ్వర్యంలో సోమవారం మచ్చబొల్లారంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం రేషన్‌షాప్ వద్ద కొత్తరేషన్ కార్డులను పంపిణీ చేశారు. పార్టీ సర్కిల్ అధ్యక్షుడు నిమ్మ అశోక్‌రెడ్డి, సీఎల్. యాదగిరి, మల్లికార్జున్, కృష్ణగౌడ్, నాగేశ్వర్‌రావు, లడ్డు, సర్వేష్‌యాదవ్, వెంకటేష్‌గౌడ్, కవిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తాళం పగులగొట్టి ఇంట్లో చోరీ

అల్వాల్: ఇంటి తాళం పగులగొట్టి దొంగతానికి పాల్పడిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచ్చబొల్లారం ఎంహెచ్‌ఆర్ కాలనీలో నివసించే సంతోష్‌కుమార్ తిరుపతికి వెళ్లి సోమవారం తిరిగొచ్చాడు. వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. దీంతో ఇంట్లోకి వెళ్లి చూడగా.. రూ.లక్ష నగదు కనిపించకపోవడంతో దొంగతనం జరిగిందని, బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

ఉప్పల్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల ప్రకటనలకు ఆకర్శితులైన పలువురు బీఆర్‌ఎస్ మహిళా నేతలు సోమవారం ఉప్పల్ నియోజవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు.

స్థానిక సమస్యలపై జెడ్సీకి వినతి



కుషాయిగూడ: స్థానిక సమస్యలపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్ సోమవారం జెడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. డివిజన్ పరిధిలోని హెచ్‌బీకాలనీ ఫేజ్-1, మీర్‌పేట్, లక్ష్మీనగర్, ఎన్టీఆర్‌నగర్, చైతన్యనగర్ డబుల్ బెడ్రూమ్ కాలనీల్లో ఓపెన్‌జిమ్‌లు, అన్నపూర్ణ కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు ప్రభుదాస్ తెలిపారు.

శాశ్వత పరిష్కారం చూపాలి..

చర్లపల్లి డివిజన్, రెడ్డికాలనీ, భగవాన్‌కాలనీ, కృష్ణనగర్, ఎంఎంఆర్ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు జెడ్సీని కలిశారు. జైళ్లశాఖకు చెందిన స్థలానికి చాలా ఏళ్లుగా ఎన్‌ఓసీ లభించలేదని, ఎమ్మెల్యే చొరవచూపి, జైళ్లశాఖ అధికారులను కలిశారన్నారు. జైళ్లశాఖ స్థలం సరిహద్దుల్లోంచి డ్రైనేజీ నిర్మాణం చేపట్టుకునేలా అధికారులు ఎన్‌ఓసీని అందజేశారని జెడ్సీకి వివరించారు. సాధ్యమైన త్వరగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. బీఆర్‌ఎస్ నేత నేమూరి మహేష్‌గౌడ్ కాలనీవాసులు ఉన్నారు.

నర్సుల హోదా పేర్లలో మార్పులు



నాచారం ఈఎస్‌ఐలో కేక్‌కట్ చేసి సంబురాలు చేసుకుంటున్న నర్సులు

మల్లాపూర్: నర్సింగ్ ఆఫీసర్లుగా, నర్సింగ్ సిబ్బంది పేర్లను మారుస్తూ.. కార్మికశాఖ తీసుకున్న నిర్ణయంపై సోమవారం నాచారం ఈఎస్‌ఐ ఆస్పత్రిలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నర్సులు కేక్‌కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్ సెక్రటరీ వేణుకుమార్ మాట్లాడుతూ.. 2023లోనే హోదాల పేర్లను మారుస్తూ.. తీసుకున్నప్పటికీ ఈఎస్‌ఐలో అమలు కాలేదు. అమలు చేయడానికి తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో 2023 నుంచి ఇప్పటి వరకు పోరాటం చేశామన్నారు. ఈ పోరాటం ఫలితామే స్టాఫ్ నర్సుని నర్సింగ్ అధికారిగా, హెడ్ నర్సుని సీనియర్ నర్సింగ్ అధికారిగా, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2 హోదాను డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 ఛీఫ్ నర్సింగ్ అధికారిగా పిలువనున్నారని స్పష్టం చేశారు. నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్ -1 గ్రేస్, యూనియన్ కార్యదర్శి వేణుకుమార్, సౌందర్య, భాగ్య, అరుణ, జమియా, అంజని, రఘు, ధన్‌రామ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సేవా సంఘాలు సంఘటితంగా ఉండాలి



కార్యవర్గసభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

రామంతాపూర్ : ఓల్డ్ రామంతాపూర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవా సంఘానికి ఇటీవల ఎన్నికైన కార్యవర్గ సభ్యులను సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేవా సంఘాలు సంఘటితంగా ఉండి తమ సంఘం అభివృద్ధికి పాటుపడుతూనే సమాజంలోని పేదలకు బలహీన వర్గాలకు చేయూతను అందించాలని సూచించారు. సేవా సంఘం అధ్యక్షుడు ఆరూరి ఆనంద్, ప్రధాన కార్యదర్శి ముత్యాల నరేష్, కోశాధికారి భరత్, ముత్యాల నరసింహ, జుట్టు నరసింహ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మౌలాలి : మౌలాలి డివిజన్ బృందావన్‌కాలనీలో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ పరిశీలించారు. సోమవారం తుదిదశకు చేరుకున్న నిర్మాణపనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. గత దశాబ్దాలుగా సమస్యలకు నెలవుగా ఉన్న కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత కార్పొరేటర్ సునీతకే దక్కుతుందని పలువురు కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. బృందావన్‌కాలనీ ప్రతినిధులు ఝాన్సీ, వెంకటరమణ, రేఖ, సుజాత, శిరీషా, బీజేపీ డివిజన్ ప్రెసిడెంట్ శివగౌడ్, కార్యదర్శి వెంకటేష్‌నేత తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత

రూ.44 లక్షలతో అభివృద్ధి పనులు



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ కొకూర్‌లోని జీవీరెడ్డి కాలనీలో రూ.44 లక్షలతో నిర్మించే సీసీరోడ్డు పనులను సోమవారం కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మచ్చబొల్లారం డివిజన్ అభివృద్ధే తన ముఖ్య లక్ష్యమన్నారు. డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. అల్వాల్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మ అశోక్‌రెడ్డి, సీఎల్.యాదగిరి, కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సెక్రటరీ ప్రదీప్‌రెడ్డి, అశ్విన్‌రెడ్డి, ప్రేమ్ కుమార్, లడ్డు, శ్రీశైలంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్కాజిగిరి: వసంతపురి సబ్‌స్టేషన్ 11కేవీ దయానంద్ ఫీడర్ పరిధిలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మరమ్మతుల కారణంగా వాణీనగర్, మారుతీనగర్, భవానీనగర్, నర్సింహ్మారెడ్డినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ గోపాల్ తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం !



న్యూ మిర్జాలగూడలో ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని న్యూ మిర్జాలగూడ, దర్గా తదితర ప్రాంతాల్లో మ్యాన్‌హోళ్లు ప్రమాదకరంగా ఉన్నాయి. రోడ్డు మధ్యలో బ్యానర్లు ప్రమాదకరంగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయా కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా భారీ వాహనాలు వెళ్లడం వల్లే పగుళ్లు పడ్డాయని ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకర మ్యాన్‌హోళ్లను తొలగించి, కొత్తవాటిని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పోకిరీల ఆట కట్టించిన పోలీసులు

ఉప్పల్: ప్రజలకు ఇబ్బంది కలిగించే పనులు ఎవరు చేసినా సహించేది లేదని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి ఉప్పల్ చౌరస్తా వద్ద క్యాబ్‌కు కారు అడ్డుగా పెట్టడంతో కారు డ్రైవర్ హారన్ కొట్టాడు. దీంతో ఆగ్రహించిన సదరు పోకిరీలు క్యాబ్ డ్రైవర్‌ను దుర్భాషలాడుతూ.. దాడికి పాల్పడ్డారు. అంతటితో ఆగకుండా కారు లోపల ఉన్న ఐటీ ఉద్యోగులపై కూడా దాడి చేసి పరారయ్యారు. క్యాబ్‌డ్రైవర్, కారులో ప్రయాణించే ఐటీ ఉద్యోగుల ఫిర్యాదుతో నిందితుల స్కూటీ నెంబర్ ఆధారంగా ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు రామంతాపూర్ ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన ఆర్. అఖిల్‌పాల్ (20)బ్యాండ్ మాస్టర్, సల్లా దీపక్ (21) విద్యార్థిగా పోలీసులు గుర్తించారు. వారి నుంచి ద్విచక్ర వాహనం (టీజీ08ఏటీ2853) స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.